క్లుప్తంగా

సభలను జయప్రదం చేయాలి



తెనాలిఅర్బన్: నెల్లూరులో ఈనెల 15,16 తేదీలలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభల లో అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ కోరారు. గాంధీనగర్‌లోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాల యంలో బుధవారం మహాసభలకు సంబంధిం చిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని విమర్శించారు. మహా సభలలో వాటిపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ తీసుకోవటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ మద్దినేని కిరణ్ బాబు, తెనాలి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నూరు సాయి, జి.శివ, నాయకులు కోలా శేఖర్, చెన్నూరు తేజ, కావేటి యశ్వంత్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

భట్టిప్రోలు: సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భట్టిప్రోలు కేఎస్‌కే మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుని లక్ష్యాల్ని చేరుకునే క్రమంలో అనేక ఆటంకాలు ఎదురవుతాయని తెలిపారు. వాటిని అధిగమించి చదువులో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్, మండల నాయకురాలు హైమ, కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

విజిలెన్స్ ఈఈ మూర్తి

రేపల్లె రూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ కేవీ ఎల్ఎస్ మూర్తి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించి, అనంతరం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. విద్యుత్ అధికారులు 59 బృందాలుగా మండలంలోని అన్ని గ్రామాల్లో 4,338 గృహ, 130 వాణిజ్య, 65 ఆక్వా సర్వీసుల్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. 159 సర్వీసుల వారు అదనపులోడును వినియోగిస్తున్నట్లుగా గుర్తించి సంబంధిత యజమానులకు రూ.6,42,260 జరిమానా విధించామని తెలిపారు. అనుమతించిన కేటగిరికి విరుద్ధంగా లోడు వాడుతున్న వారు ఆరుగురిని గుర్తించి రూ.16,000 జరిమానా, అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురిని గుర్తించి రూ.45,000 జరిమానా విధించామని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ ఈఈ వి.వి. చిరంజీవి, డీఈలు అశోక్, రాజశేఖర్, వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, ఎస్.భాస్కరరావు, తెనాలి డివిజన్‌లోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చందాలకు విద్యార్థుల్ని వినియోగిస్తే చర్యలు

ఎంఈవో కేసనశెట్టి సురేష్

రేపల్లె రూరల్: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఆయా కమిటీల సభ్యులు విద్యార్థులు, చిన్నారులతో చందాల్ని వసూలు చేయిస్తే చర్యలు తప్పవని ఎంఈవో కేసనశెట్టి సురేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. పట్టణంలో పలుచోట్ల పలువురు చిన్నారులు, విద్యార్థులు చందాలకు వెళుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని తెలిపారు. గైర్హాజరుకు సంబంధించిన వివరణను సేకరించాలని చెప్పారు. పట్టణ ప్రజలు కూడా చిన్నారులు, విద్యార్థుల్ని ఎవరైనా చందాలకు వస్తే సంబంధిత పోలీసులకు గానీ, మండల విద్యావనరుల కేంద్రంలో గానీ సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఇంటింటికీ ధర్మ ప్రచారం ప్రారంభం

రేపల్లె: హైందవ సంస్కృతిని పరిరక్షించేందుకు సమరసత సేవా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని రేపల్లె సబ్ డివిజన్ కన్వీనర్ క్రాప రవికుమార్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని పట్ట ణంలోని 1వ వార్డు శ్రీరామ్‌నగర్‌లోని రామాలయం వద్ద బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో విశిష్టమైన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేసి, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల్ని పరిరక్షించేందుకు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం హిందూ ధర్మం ప్రచార కరపత్రాలు పంపిణీ చేసి, ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సహ కన్వీనర్ శాంతి బాబూరావు, మహిళా కన్వీనర్ గొరిపర్తి రాధ, సభ్యులు వక్కలగడ్డ వెంకట్రామయ్య, నంబూరి రమాదేవి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్



వల్లభాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ 78 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే దీర్ఘ కాలిక రోగులకు, గర్భిణులు, బాలింతలు, బీపీ , షుగర్ వ్యాధి గ్రస్తులకు ఇంటి వద్దే పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, ఏఎన్‌ఎంలు , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. –వల్లభాపురం(కొల్లిపర)

మండెపాడులో పొలంబడి

మండెపాడు గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. తెనాలి ఏడీఏ ఎన్. ఉషారాణి, ఏఓ ప్రేమ్‌సాగర్‌లు రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ పొలంబడిలో రైతులందరూ కలిసి నిర్ణయాత్మక శక్తి పెంపొందించుకోవాలన్నారు. దీని వల్ల ఖర్చు తక్కువతోపాటు, నాణ్యమైన దిగుబడులు సాధిస్తారని తెలిపారు. ఈఓ ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ పొలంబడిలో ఉన్న నాలుగు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మిత్ర పురుగుల గురించి వివరించారు. వరిలో సాగు ఖర్చు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్, వీఏఏ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు. –తెనాలి టౌన్





పట్టించుకోవడం లేదనీ...

ఖాళీ స్థలాలను యజమానులు బాగు చేయించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి సూచించారు. 40వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు ఉన్న ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మలా మాట్లాడుతూ 40వ వార్డులో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, న్యాయవాది పెరికల డానియేల్, పాముల ప్రసంగి పాల్గొన్నారు. –తెనాలిఅర్బన్

భక్తిశ్రద్ధలతో ఏకాహం

పట్టణంలోని షరాబ్ బజారులో వేంచేసియున్న శ్రీ సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనారాయణ పారాయణ ఏకాహం నిర్వహించారు. ఆలయంలో సీతారామస్వామి, పంచముఖ ఆంజనేయస్వామికి తొలుతగా పూజలు జరిపారు. అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, అర్చకులు కిరణ్‌కుమార్, సురేష్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, మూర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. – తెనాలి టౌన్



పింఛన్‌తో ఆర్థిక భరోసా

- జగనన్నను ఆశీర్వదించండి
- హామీలన్నీ అమలు చేస్తున్నారు
- ఎమ్మెల్యే శివకుమార్
- పండుగ వాతావరణంలో 499 మందికి పింఛన్ పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకతో నిరుపేదలైన వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాలకేంద్రంలో కల్యాణ మండపంలో మండల పరిధిలోని 449 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎంపీపీడీ వి.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు సీఎం జగనన్న ఆశీస్సులతో తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే చేయని విధంగా సంక్షేమం కోసం రూ.18 వేల కోట్ల ఖర్చు చేసినట్లు చెప్పారు.

గత ప్రభుత్వం హయాంలో వృద్ధులు, వికలాంగులు, పింఛన్ల పంపిణీ కేంద్రాల వద్ద రెండు, మూడు రోజులు ఉండి పింఛన్ తీసుకునే పరిస్థితి ఉండేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పింఛన్ల పంపిణీ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి ప్రతినెలా 1వ తారీకున లబ్ధిదారుల ఇంటి వద్దనే వలంటీర్లు ద్వారా ఉదయం 6 గంటలకల్లా అవ్వా , తాతలకు, వికలాంగులకు పింఛన్ సొమ్ము అందించటం జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు అనుగుణంగా అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలు అనే తేడా లేకుండా అందరికీ పింఛన్లు అందజేయడం జరుగుతోందన్నారు.

కొల్లిపర మండలంలో 2019లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 5841 మందికి నెలకి రూ. 59 లక్షలు ఇస్తుండగా, వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటికి 10 వేల మంది లబ్ధిదారులు కాగా వారికి నెలకి రూ. 2,69 కోట్లు పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. తెనాలిలో టీడీపీ హయాంలో 22 వేల మందికి పింఛన్ ఇవ్వగా, తెనాలి నియోజక వర్గంలో తెనాలి పట్టణం, మండలం కలసి ప్రతినెల 37,846 వేల పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు, ఇందుకు గాను ప్రతినెల రూ.10 కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. వృద్ధులను వారి కుమారులు చూచినా, చూడక పోయినా ఆ వృద్ధులకు భద్రత కల్పించాలి అనే మంచి ఆలోచనతో వారికి పెద్ద కొడుకుగా అండగా ఉండాలని ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కొంత వారికి ఆర్థిక భరోసా ఉండాలని ప్రతినెలా పింఛన్ ద్వారా రూ.2750 అందించటం జరుగుతుందన్నారు. త్వరలో పింఛన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరికి రూ.3 వేలు చొప్పున పింఛన్లు అందజేస్తారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఇంతగా సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వాన్ని రానునన్న ఎన్నికల్లో మళ్లీ అఖండ విజయంతో గెలిపించి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నుకోవాలని కోరారు. అనంతరం ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అవుతు సీత నగేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఆరిగ చంద్రారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, కొల్లిపర సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి , కళ్ళం వీరారెడ్డి, వంగా భూషిరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, పరిపాలనాధికారి వి.చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు అన్నవరపు రమేష్, వివిధ గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు. పార్టీ నాయకులు, పింఛన్ లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలిలో..

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం పట్టణంలోని పలు వార్డులలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు పంపిణీ చేశారు. 40వ వార్డులో నూతనంగా మంజూరైన 16 పింఛన్‌లను మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి పంపిణీ చేశారు. అలాగే 24వ వార్డులో నూతనంగా మంజూరైన 19 పింఛన్‌లను కౌన్సిలర్ పెదలంక లక్ష్మిలావణ్య, 28వ వార్డులో మంజూరైన 25 పింఛన్‌లను కౌన్సిలర్ యాతాటి అనీల్‌లు పంపిణీ చేశారు. ఆయా సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమంలో అడ్మిన్‌లు, వార్డు వాలంటీర్‌లు. పాల్గొన్నారు.

11వ వార్డులో...

తెనాలి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లు వయోవృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు భరోసానిస్తున్నాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కఠారి హరీష్ అన్నారు. పట్టణ 11వ వార్డులో నూతనంగా మంజూరైన 44 పింఛన్లను బుధవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీలు, కులమతాలను చూడకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని గుర్తుచేశారు. కేవలం పింఛన్లే కాకుండా వివిధ రకాల సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందజేస్తూ వారి జీవన ప్రమాణాల పెంపుదలకు తోడ్పడుతున్న రాష్ట్రప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరి నాగరాజు, కడియం నాగేశ్వరరావు, షేక్ మౌలాలి, కొమ్ము గోపి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తెనాలి 40వ వార్డులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న వైస్‌చైర్మన్ నాగవేణి



తెనాలి 24వ వార్డులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ లక్ష్మిలావణ్య.అడ్మిన్ అబ్దుల్లా



పింఛన్లు అందజేస్తున్న హరీష్



తెనాలి 28వ వార్డులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అనీల్

గ్రీష్మశ్రీ, తహసీన్‌లు తెనాలికి గర్వకారణం



గ్రీష్మశ్రీ, తహసీన్‌లను సన్మానిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ, డాక్టర్ శారద

తెనాలిఅర్బన్: కూచిపూడి నృత్య ప్రదర్శనలో పలు రాష్ట్రాల గవర్నర్‌ల ప్రశంసలు పొందిన చిన్నారులు గ్రీష్మశ్రీ, తహసీన్‌లు తెనాలి పట్టణానికే గర్వకారణం అని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ, శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ శారదలు పేర్కొన్నారు. ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని రత్న పార్చ్యూన్ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం చిన్నారుల అభినందన సభను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీష్మశ్రీ, తహసీన్‌లు ఇటీవల కర్ణాటక గవర్నర్ తవార్ చంద్ గెహ్లాట్, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయల సమక్షంలో కూచిపూడి నత్య ప్రదర్శన చేసినట్లు తెలిపారు. వారి నుంచి ప్రశంశలు పొందటంతో పాటు నగదు ప్రోత్సాహక బహు మతులు కూడా అందుకున్నట్లు చెప్పారు. అనంతరం చిన్నారులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సినీ దర్శకులు దిలీప్ రాజా అధ్యక్షత వహించగా డాక్టర్ కావూరి అనీల్ కుమార్, రోటరీ క్లబ్ సహాయ గవర్నర్ కన్నెగంటి మురళీ, మిలటరీ ప్రసాద్, ఎ.రాజేశ్వరి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, పినపాటి సురేష్ బాబు, రావి చిన్ని, నాట్య గురువు నిర్మలా రమేష్, ఈదర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

కొల్లూరు:పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ పి. నగరాజకుమారి తెలిపారు. కిష్కింధపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాల్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయురాలు టి. లక్ష్మీరేఖ, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఏఎన్ం దుర్గ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమూరులో..

పోషకాలు కలిగిన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీతిరుపతమ్మ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీ తిరుపతమ్మ మాట్లాడుతూ ఆహారంలో ప్రతి రోజు ఐరన్, మాంసకృత్తులు, పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జె.వి. రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

150 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నిజాంపట్నం: నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని అదవల కేసనవారిపాలెం, అడవులదీవి గ్రామాల్లో బుధవారం దాడులు నిర్వహించారు. రెండు గ్రామాలకు వెళ్లే మడ అడవుల్లో 150 లీటర్ల బెల్లం ఊటతో పాటు నాటుసారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అడవులదీవి గ్రామంలో నాగేశ్వరమ్మ ఇంటి వద్ద మూడు లీటర్ల నాటుసారాను స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

సర్కారీ బడులకు జీవం

విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది



ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నడు లేని విధంగా నాడు–నేడు పథకం ద్వారా విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, ప్రహరీలు, రక్షిత మంచినీటి పథకాలు కూడా ఏర్పాటు చేశారు. కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో కూడా లేని వసతులు ఇక్కడ కల్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది.

– షేక్ మౌలాలి, మున్సిపల్ బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, తెనాలి.

- నాడు–నేడుతో అభివృద్ధి పథంలో మరో 20 ప్రభుత్వ పాఠశాలలు
- కొనసాగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులు
- తెనాలి పరిధిలో రెండవ విడత రూ.3.02 కోట్ల నిధులు కేటాయింపు



చెంచుపేటలోని కె.ఎస్.ఎం.స్కూల్‌లో చేపట్టిన భవన నిర్మాణ పనులు



మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో నాడు–నేడు కింద జరుగుతున్న నిర్మాణ పనులు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో ప్రవేశపెట్టిన నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. మొదటి విడత కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పూర్తిచేసి, రెండోవ విడత పనులు ప్రారంభించారు. తెనాలి పట్టణంలో రెండోవ విడత కింద 20 పాఠశాలలను ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేసేందుకు రూ.3.02 కోట్ల నిధులు వెచ్చించారు. మార్చి 14న పనులు ప్రారంభమై చివరి దశలో ఉన్నాయి. తెనాలిలో 53 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో మౌలిక వసతుల కల్పన చేయటంతో పాటు కార్పొరేట్ స్థాయిలో అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకాన్ని 2019లో ప్రవేశపెట్టారు. మొదటి విడత కింద పట్టణంలోని 22 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం, రక్షిత మంచినీటి ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్లు నిర్మాణం, మురుగునీటి వసతి ఏర్పాటు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, ఎలక్ట్రికల్ వర్క్, గ్రీన్ చాక్ బోర్డు, ఫర్నీచర్, పెయింటిగ్స్, మేజర్, మైనర్ రిపేర్లు చేశారు. మొదటి విడత పనులను 14 మార్చి 2022లో పూర్తి చేశారు. అనంతరం రెండోవ విడత కింద పట్టణంలోని మరో 20 పాఠశాలలను ఎంపిక చేసి వాటి పనులు ఈఏడాది మార్చిలో ప్రారంభించారు. వీటి కోసం రూ.3.02 కోట్ల నిధులు వెచ్చించారు. వాటి పనులు చివరి దశకు చేరాయి.

రూ.7.08 కోట్ల నిధులు

తెనాలి పట్టణంలోని 53 పాఠశాలలో నాడు–నేడు కింద మొదటి విడత 22 పాఠశాలలు, రెండోవ విడత 20 పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వీటి కోసం మొదటి విడత రూ.4.06 కోట్లు, రెండవ విడత రూ.3.02 కోట్లు వెచ్చించారు. అంటే రెండు విడతలలో 42 పాఠశాలల్లో రూ.7.08 కోట్లతో అభివృద్ధి చేశారు. మిగిలిన 11 పాఠశాలలను మూడవ విడత కింద అభివృద్ధి చేయనున్నారు.

చివరి దశకు రెండవ విడత పనులు

నాడు–నేడు కింద రెండవ విడత చేపట్టిన 20 పాఠశాలల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వాటిల్లో ఇప్పటి వరకు సుమారు 81 శాతం పనులు పూర్తయ్యాయి. అంతేకాకుండా వాటికి సంబంధించిన బిల్లులు కూడా సదరు కాంట్రాక్టర్‌లకు చెల్లింపులు జరిగాయి. రెండవ విడత కింద విడుదల అయిన రూ.3.02 కోట్ల నిధులలో ఇప్పటి వరకు 2.44 కోట్ల నిధుల చెల్లింపులు జరిగాయి. మిగిలిన రూ.59 లక్షలు చెల్లించాల్సి ఉంది. పనులు పూర్తయితే వాటి చెల్లింపులు కూడా చేస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

నెలాఖరులోగా పనులు పూర్తి



నాడు–నేడు రెండవ విడత పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఈనెల చివరిలోపు అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. పాఠశాలలు జరుగుతున్నందు వల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేస్తున్నాం. దీనివల్ల వాటి నిర్మాణాలు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. –కొడాలి నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్, తెనాలి.

ఇబ్బందులు తొలగాయి



ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక గతంలో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మాకు సరైన టాయిలెట్స్ లేక ఉన్న గదులలో ఎక్కువ మంది విద్యార్థులు కూర్చోవాల్సి వచ్చేది. అలాగే మంచినీటి సదుపాయం కూడా సరిగ్గా ఉండేది కాదు. కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కావల్సిన వసతులను సీఎం జగన్ కల్పించారు. ఆయన కృషి వలన ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. –గంగి అభినవ్, 8వ తరగతి, తెనాలి

కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు



మాబాబు అబ్దుల్ రిహాన్ మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలల్లో మంచిగా విద్యాబోధన చేస్తున్నారు. అలాగే పిల్లలకు కావల్సిన వసతులు ప్రభుత్వం సమకూర్చింది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. –షేక్ నూర్జహాన్, విద్యార్థి తల్లి, తెనాలి.